# ఉలిపికట్టె

హఠాత్తుగా శంకరం పోయాడు.

మాధురి గుండె ఆగిపోలేదు.

మతి స్థిరం తప్పలేదు.

కనీసం గొంతెత్తి ఏడవనైనా లేదు.

కూతురుని పట్టుకుని శాంతమ్మ గొల్లుమని ఏడ్చింది. ఇరువైపుల బంధువులూ విచారపడిపోయారు. "ఇంత చిన్న వయసుకే ఇంత కష్టమా?" అన్నారు. కాని చిత్రం! మాధురి ఏడవలేదు.

చుట్టాలు ఎవరిని అనునయిస్తారు?

తల్లి ఎవరికి ధైర్యం చెబుతుంది?

అంత సానుభూతీ ఎవరికి చెందేటట్లు?

శవం సాగిపోతుంటే రెండే రెండు కన్నీటి బొట్లు మాధురి చెక్కిళ్ళ మీద జారాయి.

అందరూ భయపడుతూనే వున్నారు... మాధురి ఏదో అఘాయిత్యం చేస్తుందని, వున్నట్లుండి ఏదో విపరీతం జరుగుతుందని. కానీ మాధురి ఏ అఘాయిత్యమూ చెయ్యలేదు. ఆ ఇంట్లో ఏ విపరీతమూ జరగలేదు.

పదకొండు రోజులు ముగిశాయి. మాధురికి విధవ ముద్రపడింది. తన తల్లి గుండె చెరువయ్యేలా ఏడ్చింది. మాధురి మాత్రం అతి మౌనంగా తతంగాలన్నీ ముగించుకుంది.

విడ్డూరం అనుకున్నారు అందరూ. అవును మరి భర్త పోతే స్త్రీకి జీవితంలో ఏం మిగులుతుంది? మాధురికి పెళ్ళయి రెండేళ్లయినా పూర్తి కాలేదు. ఇంతలో ఈ అన్యాయం జరిగిపోయింది. ఇంతకూ మాధురి ఏడవలేదెందుకని? ఏమో కాలం మరీ పాడయిపోతోంది. అయినా ఇదేం ఆడది తల్లీ? దానిది హృదయమా, శిలాఫలకమా? అది మనిషా, రాక్షసా?

ఈ అభిప్రాయాలు మాధురి వినిపించుకోలేదు. కాని ఊహించుకుంది.

కన్నతల్లికి కూడా కూతురి తత్వం బోధ పడలేదు. ఆ చీకటి రాత్రి మాధురి కూడా తనను తాను ప్రశ్నించుకొంటూ జ్ఞాపకాల పుటలు తిరుగవేసింది.

* * *

వివాహం ఒక వ్యవస్థ, దానికి తాను కట్టుబడింది. ప్రేమించి భంగపడిందీ లేదు, తియ్యటి జీవితం ఊహించుకోనూ లేదు. జీవితం యథాతథంగా తీసుకుంది తాను.

కాని..., ఆయన... కేవలం యంత్రమని కొన్ని రోజుల్లోనే తెలిసిపోయింది. ఏపనిలోనూ అతనికి అనుభూతివున్నట్లు కనిపించలేదు. తన అవసరం కనిపించిన క్షణాల్లో 'ఏయ్ ఇటురా' అని ఆజ్ఞాపించేవాడు. మాటాపలుకూ లేకుండా తన కోర్కెలు తీర్చుకొనేవాడు. ఆ క్షణాల్లో బాగా మదించి బుసలుకొట్టున్న ఎద్దు గుర్తు కొచ్చేది మాధురికి.

లోకానికి తను గొప్ప ఉద్యోగస్థుని భార్య. సంస్కారంగల వ్యక్తి తన భర్త. కాని వీధిలోకి వస్తే వెయ్యి అనుమానాలతో తనను చూస్తుంటాడు. తనమాట, పలుకు, చూపులు అన్నీ విమర్శిస్తాడు. నవ్వితే, ''ఏమిటా వెకిలినవ్వు?'' ఊరుకుంటే, ''ఎప్పుడూ ఏడుపు మొహమే'', అలంకరించుకొంటే, ''ఏమిటా షోకులు?'' సాదాగావుంటే ''ఏం నీ మొగుడు నీ అవసరాలు తీర్చటం లేదా?'' అని సూటిపోటి మాటలతో హింసిస్తుంటాడు.

తను సాధ్యమయినంతవరకు ఓర్చుకుంది. తన మౌనం కూడా ఆయనను రెచ్చగొట్టేది.

ఒక సాయంకాలం వచ్చీరాగానే...

''ఎవడికోసం ఎదురుచూస్తున్నావు?'' అన్నాడు కఠినంగా.

తెల్లబోయింది.

''ఆ దొంగచూపులూ, నీవూ... సమాధానం చెప్పవేం?''

''వీధిలో ఏదో అమ్మకానికి వస్తే-''

''చాల్లే... అన్నీ భోగంవేశాలు''

తన గుండెను పిండినట్లయింది, ''ఛీ...ఏం మనిషి మీరు?'' అని బలవంతంగా అంది. తన దవడలు వాచిపోయాయి. తలను గోడకేసి బాదాడు. ''నన్ను ఛీ కొట్టే స్థాయికి చేరుకున్నావన్నమాట''

''ఇంత పశువనుకోలేదు'' అంది ఉద్రేకాన్ని అదుపులో పెట్టలేని తను.

ఫలితంగా రెండు రోజులు అడుగుతీసి పెట్టలేకపోయింది. అప్పుడే అతనిని హృదయ పూర్వకంగా అసహ్యించుకొంది. సాటి మనిషిని ఏ కారణం లేకుండా బానిసలా చూసుకొనేవాళ్లను చిత్రహింస పెట్టి ఆనందం పొందేవాళ్ళను భరించటమెంత కష్టమో, తనకు తెలిసి వచ్చింది.

ఒక మధ్యాహ్నం నిద్రబోతున్న తన జుట్టు గుంజినట్లయి ఉలిక్కిపడి లేచింది.

"ఎవడు వీడు?"

తనకు అర్థం కాలేదు.

అతని చేతిలో కాలేజి కల్చరల్ అసోషియేషన్ ఫోటో.

"ఏమిటలా చూస్తావు? ఒయ్యారంగా వాడి మీద ఒరిగి కూర్చున్నావు. ఎవడు వీడు?"

"నా ప్రియుడు... ఆ మాత్రం తెలీదూ కాలేజిలో చదివిన తర్వాత ఫోటోలు మీటింగులు వుంటాయని."

"తెలుసు తర్వాత మొగుడితో కాపురం చెయ్యాలని తెలీదూ?" పిడికిలి బిగించి పొట్టలో గుద్దాడు...

తన స్నేహితురాలనేది నవ్వుతూ "భార్యలను కొట్టటమనే పశుత్వమేనాడో పోయింది. భర్తలను కొట్టే కాలంకూడా దగ్గరలోనే వుంది." అని.

ఏం మారాడు మగవాడు? అనుక్షణం ద్వేషం, అసూయ, శత్రుత్వం. ఇదేమి జీవితం? ఈ ముళ్ళపొదల జీవితమేనా దాంపత్యమనే నందనవనం? తనని చూస్తే అతనిలో రాక్షసత్వం విజృంభిస్తుందెందుకని?

మనిషి ఎంతో అశక్తుడు. ఉన్న కాస్త జీవితాన్ని ఇలా ద్వేషాలతో ఎందుకు నరక ప్రాయం చేసుకుంటాడు? అతనితో ఈ విషయాలన్నీ చర్చించాలనిపించేది. కాని కర్కశమైన మాటలు, తీవ్రమైన చూపులు తన ఒళ్ళు జలదరింపజేసేవి.

ఆయన ఇంట్లోవుంటే తనకు ముళ్ళమీద వున్నట్లుండేది. సాయంకాలం దగ్గరపడుతుంటే, ఆయన అడుగుల చప్పుడు వింటే తన గుండె లయ తప్పేది. ఎప్పుడూ కొరడా పట్టుకున్నట్లే క్రూరంగా చిత్రించుకునేది అతన్ని. అతనితో ఏకశయ్యమీద పడుకోవవటమంటూ జరిగితే తనకు నిద్రపట్టేది కాదు. ఒకవేళ నిద్ర పట్టినా, కలత నిద్రే! దానిలో పీడకలలు. ఎన్నోసార్లు నిద్దట్లో కెవ్వున అరచి అతనితో చీవాట్లు తింది.

ఒక అర్థరాత్రి బాగా తాగివచ్చాడు.

"ఇదీ భరించాలా?" అంది కోపంగా.

"నువ్వెవ్వరు నాకు చెప్పటానికి? నేను సంపాదిస్తాను నా యిష్టం. నోరు మూసుకు ఇటురా!"

ఛీ! ఛీ! పాడూ...

"ఏమిటే నీ వాగుడూ?"

ఆ ఉక్కు చేతులు తన బతుక్కే సవాలు.

"ఆడదన్న తర్వాత అణిగిమణిగి వుండాలి. సావిత్రి, సుమతి కథలు చదువుకోలేదూ? వాళ్ళందరూ నీలాగే బరితెగించారా?"

"ఆ కట్టుకథలు నాకు చెప్పకండి. ద్వేషంతో, అధికారంతో ఎవరినీ మీ వారిగా చూసుకోలేరు. అలా ఎవరైనా మీకు అణిగి వున్నా అది పిరికితనమూ, శక్తి హీనతే. లోలోన మిమ్మల్ని తప్పక ద్వేషిస్తారు."

గాజుగ్లాసు ఎగిరివచ్చి తన నుదిటిని కొట్టుకుంది.

"చెప్పుతోంది పెద్ద ఉపన్యాసం. కాలేజి చదువులు వెలగబెట్టావుగా."

ఎడమచేత్తో రక్తం తుడిచేసుకుంటూ బాత్‌రూంకేసి నడిచింది తను.

ప్రతిరోజూ ఒక శాపం. ఇల్లొక నరకం. ఇలా ఎన్నాళ్ళు? ప్రేమానురాగాలు ఏనాడో మరచిపోయి సహించటం నేర్చుకుంది. అదీ బాగా సన్నగిల్లుతోంది. అవును పెళ్ళి ఒక సాంఘిక వ్యవస్థ. తల్లిదండ్రుల కోసం, మర్యాద కోసం సహించింది. కానీ ఎన్నాళ్ళు? ఎన్నాళ్ళు? ఒకసారి ధైర్యం చేసి అడిగేసింది.

"ఇద్దరూ ఒకర్నొకరు ద్వేషించుకొంటూ బతక్కపోతేనేం? మీకు నచ్చిన వాళ్ళనెవరినైనా చేసుకోండి. నాకు విముక్తి కలిగించండి. ఉద్యోగం చేసుకు బతగ్గలను."

"నీ కర్మ, నాకర్మ, అనుభవించక తప్పదు, సంఘంలో నేను తలెత్తుక తిరగొద్దా? అయినా కాలేజి ప్రియుడెవరయినా ఉత్తరం వ్రాశాడా?"

అబ్బ! మాటల్లో విషయం మిళాయించటమంటే ఇదే కాబోలు!

"ఇదిగో ఈ మాట ఎన్నడూ ఎత్తకు. నీవీ విధంగా కుంగి కుంగి చావవలసిందే. నేను సుఖపడను. నిన్ను సుఖపడనివ్వను. అలా నిలువు గుడ్లేసుకు చూస్తావేం? తిండిపడెయ్."

తాగుడు ఎక్కువయిందని డాక్టరు చెప్పనూ చెప్పాడు. అయినా తను మానలేదు. ఆ మత్తులో ఒక రాత్రి లారీ కిందపడ్డాడు.

"ఇన్ని దెబ్బలు తగిలినా నేను చావనే, నేను చస్తే నువ్వు సుఖపడిపోవూ?" చచ్చేముందు రోజు అతినీరసంగా అతనన్న మాటలివి.

చచ్చిపోయాడు. తన జీవితంలో తుఫాను వెలిసింది. ఈ తుఫానులో తన పసుపు కుంకుమలు కోల్పోయింది. నిరంతరం ద్వేషిస్తూ, చిత్రవధ చేసిన వ్యక్తికి,

ఒకటయినా మధురానుభూతిని ఇవ్వని వ్యక్తిని కోల్పోయినందుకు తను విలపించాలా? ఇద్దరూ శత్రువుల్లా జీవించారు. కేవలం ఒక సామాజిక వ్యవస్థకు కట్టుబడి ఎలా ఆరాధించగలదు? కుక్కమొరిగితేనే రాయి విసిరే తత్వం మనిషిది. అటువంటిది రోజూ శారీరకంగా, మానసికంగా బాధించిన వ్యక్తిని ఎవరైనా ఎలా ప్రేమిస్తారు? అందరూ గౌతమ బుద్ధులు, మహర్షులూ కారు కదా అయినా ... తను తప్పుదారిలో వుందేమో! ఏమో... భారత సతీత్వానికే కళంకమేమో? కాని తనను తాను మభ్యపెట్టుకోలేదు. అతను లేడని తాను ఏడవలేదు. అసహజం... అన్యాయం... అవినీతి... అధర్మం. ఉహుఁ గుండెల్లో లేని స్పందన మాటల మూలంగా రాదు. తన జీవితాన్ని శాపంగా మార్చిన తన దుర్విధికి ఏడుస్తుంది. కాని భర్త మరణానికి కాదు... అవును, భర్త మరణానికి కాదు... అవును, భర్త మరణానికి కాదు...